క్లుప్తంగా

కంటి సమస్యలపై అవగాహన అవసరం



అంగరలో కంటి ప్రాధాన్యంపై మాట్లాడుతున్న రాంబాబు

కపిలేశ్వరపురం: కంటి సమస్యలపై అవగాహన అవసరమని అంగరలో నిర్వహించిన కంటి సమస్యల అవగాహన సదస్సులో పాల్గొన్న వక్తలన్నారు. స్థానిక శ్రావణి ప్రాథమిక వైద్యాలయంలో గురువారం కమ్యూనిటీ పారామెడిక్స్ అండ్ ప్రైమరీ హెల్త్ కేర్ ప్రొవైడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ సదస్సులో అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షులు గంగుమళ్ళ రాంబాబు మాట్లాడారు. సూర్య ప్రాథమిక కంటి ఆసుపత్రి వైద్యులు కోటేశ్వరరావు కంటి సమస్యలపై అవగాహన కల్పించారు. అనంతరం నిర్వహించిన పీఎంపీ మండల అసోసియేషన్ సర్వసభ్య సమావేశం నిర్వహించగా సీజనల్ వ్యాధులకు చికిత్సా పద్ధతులపై చర్చించారు. కార్యక్రమంలో నాయకులు సూరంపూడి భద్రరావు, రుద్రా వెంకట లక్ష్మీనారాయణ, బట్టా సత్యనారాయణ పాల్గొన్నారు.

పౌష్టికాహారంతోనే ఆరోగ్యం



కపిలేశ్వరపురంలో మాట్లాడుతున్న పీహెచ్‌సీ, ఐసీడీఎస్ ప్రతినిధులు

కపిలేశ్వరపురం: పౌష్టికాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం పొందవచ్చని ఎంపీహెచ్‌ఈఓ జిత్తుక మల్లికార్జునుడు అన్నారు. కపిలేశ్వరపురంలో ఐసీడీఎస్ పర్యవేక్షణలో అంగన్‌వాడీలు ఆధ్వర్యంలో అవగాహన సదస్సు నిర్వహించారు. అంగన్‌వాడీలు ఆధ్వర్యంలో తయారు చేసిన పౌష్టికాహార పదార్థాలను సదస్సులో ప్రదర్శించారు. అంగర పీహెచ్‌సీ ఎంపీహెచ్‌ఈఓ జిత్తుక మల్లికార్జునుడు మాట్లాడుతూ ఆరోగ్యకర సమాజ నిర్మాణానికి పౌష్టికాహారం ప్రధాన పాత్రను పోషిస్తుందన్నారు. కార్యక్రమంలో ఐసీడీఎస్, అంగర పీహెచ్‌సీ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.


597 మంది విద్యార్థులకు కంటి పరీక్షలు



విద్యార్థులకు కంటి పరీక్షలు చేస్తున్న ఆసుపత్రి సిబ్బంది

రామచంద్రపురం రూరల్: ద్రాక్షారామ జెడ్పీ హైస్కూల్ విద్యార్థులు 597 మందికి శ్రీ కిరణ్ కంటి ఆసుపత్రి ద్రాక్షారామ శాఖ ఆధ్వర్యాన గురువారం ఉచితంగా కంటి పరీక్షలు నిర్వహించారు. తొలుత కళ్లను ఏవిధంగా సంరక్షించుకోవాలి, కంటి ఆరోగ్యానికి ఎటువంటి ఆహారం తీసుకోవాలనే అంశాలపై కంటి వైద్యులు లలిత, సునీత అవగాహన కల్పించారు. కంటి అద్దాలు అవసరమైన 50 మందికి వారం రోజుల్లో ఉచితంగా కళ్లజోళ్లు అందజేస్తామని ఆసుపత్రి మేనేజర్లు శివగణేష్, ప్రసాద్ తెలిపారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు గుణ్ణం రాజేశ్వరి, జిల్లా సైన్స్ అధికారి గిరజాల వెంకట సత్య సుబ్రహ్మణ్యం, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

గడువులోగా ఈ-కేవైసీ చేయించుకోవాలి



పల్లిపాలెం ఆర్‌బీకేలో ఈ-కేవైసీ విధానాన్ని పరిశీలిస్తున్న అశోక్

కాజులూరు: సార్వా పంట కాలానికి గడువు ముగిసేలోగా రైతులందరూ తప్పనిసరిగా ఈ-కేవైసీ చేయించుకోవాలని మండల వ్యవసాయాధికారి వి.అశోక్ సూచించారు. మండలంలోని పలు గ్రామాల్లోని రైతుభరోసా కేంద్రాల(ఆర్‌బీకే)ను ఆయన గురువారం సందర్శించారు. పల్లిపాలెం ఆర్‌బీకేలో రైతులతో మాట్లాడుతూ, మండలంలో నూరు శాతం ఈ-పంట నమోదు పూర్తయ్యిందని చెప్పారు. ఇకపై రైతులందరూ ఆయా ఆర్‌బీకేలను సంప్రదించి ఈ-కేవైసీ (వేలిముద్రలు) వేయడం ద్వారా లేదా ఫోన్ ఓటీపీల ద్వారా ఈ-కేవైసీ పూర్తి చేసుకోవాలని సూచించారు. ఈ-కేవైసీ లేకుంటే ప్రభుత్వ పథకాలు అందుకోవడంలో ఇబ్బందులు ఎదురవుతాయని అశోక్ స్పష్టం చేశారు.

పండగలా పింఛన్ల పంపిణీ

- లబ్ధిదారులకు అందజేసిన ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు
- గ్రామాల నుంచి తరలివచ్చిన పింఛనుదారులు



పసలపూడిలో లబ్ధిదారులకు పింఛన్లు అందజేస్తున్న ఎమ్మెల్సీ త్రిమూర్తులు



పింఛన్ల పంపిణీకి అర్తమూరు నుంచి తరలివస్తున్న సర్పంచ్ అన్నపూర్ణ, విజయభాస్కరరెడ్డి, గ్రామస్తులు

మండపేట: పేద బతుకులకు భరోసానిస్తూ ప్రభుత్వం మంజూరు చేసిన పింఛన్ల పంపిణీ కార్యక్రమం పండగలా జరిగింది. ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు ముఖ్య అతిథిగా హాజరై లబ్ధిదారులకు ప్రభుత్వ సాయం అందించారు.

మండపేట మండలానికి సంబంధించి కొత్తగా 727 సామాజిక పింఛన్లు మంజూరయ్యాయి. గురువారం సాయంత్రం తాపేశ్వరంలోని అతిథి ప్రాంగణంలో ఎంపీపీ వుండమట్ల శ్రీనివాస్ అధ్యక్షతన జరిగిన పింఛన్ల పంపిణీ కార్యక్రమం జరిగింది. ప్రతి గ్రామం నుంచి ఆయా గ్రామాల సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు, పార్టీ నేతల ఆధ్వర్యంలో లబ్ధిదారులతో పాటు వందలాదిగా తరలివచ్చిన పార్టీ శ్రేణులతో సభా ప్రాంగణం కిక్కిరిసిపోయింది. అర్తమూరు నుంచి గ్రామ సర్పంచ్ గొలుగూరి అన్నపూర్ణ, మండల మాజీ ఉపాధ్యక్షుడు విజయభాస్కరరెడ్డి దంపతుల ఆధ్వర్యంలో లబ్ధిదారులు, కార్యకర్తలు 200 మందికి పైగా ప్రత్యేక వాహనాల్లో తరలివచ్చారు. అలాగే ద్వారపూడి, కేశవరం, ఏడిద, మెర్నిపాడు, పాలతోడు, వెలగతోడు, మారేడుబాక తదితర గ్రామాల నుంచి ప్రజలు కార్యక్రమానికి హాజరయ్యారు. పార్టీ రాష్ట్ర కార్యదర్శి దూలం వెంకన్నబాబు, జెడ్పీటీసీ సభ్యురాలు కుడిపూడి భవాని, ప్రత్యేకాధికారి ఓ రామకృష్ణ, ఎంపీడీఓ ఐ రాజు తదితరులతో కలిసి ఎమ్మెల్సీ తోట లబ్ధిదారులకు పింఛన్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ తోట మాట్లాడుతూ గత ప్రభుత్వానికి, వైఎస్సార్ ప్రభుత్వ పాలనకు మధ్య వ్యత్యాసాన్ని ప్రజలు గమనించాలన్నారు. పేదల సంక్షేమమే ధ్యేయంగా పని చేస్తున్న సీఎం జగన్ మోహన్‌రెడ్డికి ప్రజలు అండగా నిలవాలని కోరారు. పార్టీ నేత వెంకన్నబాబు, ఎంపీపీ శ్రీనివాస్, ఏఎంసీ వైస్ చైర్మన్ చిక్కాల శ్రీనివాసరావు, వైస్ ఎంపీపీ పసుమర్తి నాగబాబు, ఏఎంసీ డైరెక్టర్లు పలివెల సుధాకర్, సమతం పాపారావు, ఎంపీటీసీ సభ్యులు చొల్లంగి సత్యవేణి, దేవు ప్రసాద్‌నాయుడు, పార్టీ నేతలు కుడిపూడి రాంబాబు, సాదే పిడుగురాముడు తదితరులు మాట్లాడుతూ పేదల సంక్షేమమే ధ్యేయంగా నియోజకవర్గ అభివృద్ధికి ఎమ్మెల్సీ తోట చేస్తున్న కృషిని వివరించారు. ఆర్‌బీకే మండల చైర్మన్ అన్నందేవుల చంద్రరావు, సర్పంచులు ఈతకోట కిన్నెర, మట్టపర్తి గోవిందరాజులు, ఉప సర్పంచులు తులా శేషారావు, వరదా చక్రవర్తి, పార్టీ నాయకులు పిల్లా అరవరాజు, గారపాటి అశోక్ కుమార్, పోతుల రాంబాబు, తోరం శ్రీనివాస్, కొప్పిరెడ్డి ప్రసాద్, పిల్లా సూరిబాబు, చింతలపూడి మల్లిబాబు, చిన్ని గంగాధరం తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమానికి చిరునామాగా వైఎస్సార్ సీపీ ప్రభుత్వం

రాయవరం: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నేతృత్వంలోని వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం సంక్షేమానికి చిరునామాగా మారిందని ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు అన్నారు. మండలంలోని పసలపూడి చింతా సుబ్బారాయుడు ఛారిటబుల్ ట్రస్ట్‌లో నూతనంగా మంజూరు చేసిన లబ్ధిదారులకు పింఛన్లు పంపిణీ చేశారు. ఎంపీపీ నౌడు వెంకటరమణ అధ్యక్షతన జరిగిన సమావేశంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న ఎమ్మెల్సీ త్రిమూర్తులు మాట్లాడారు. సమావేశంలో మార్కెట్ కమిటీ చైర్మన్ సిరిపురపు శ్రీనివాసరావు, ఎంపీపీ నౌడు వెంకటరమణ, మండల సర్పంచ్‌ల సమాఖ్య అధ్యక్షుడు ఆరిఫ్, ఉప సర్పంచ్ పోతంశెట్టి సాయిరామ్మోహన్‌రెడ్డి తదితరులు మాట్లాడారు. అనంతరం 520 మంది నూతన పింఛనుదారులకు రూ.14,41,500ల నగదును ఎమ్మెల్సీ త్రిమూర్తులు చేతుల మీదుగా అందజేశారు. ఎంపీడీవో కె.నరేంద్రరెడ్డి, పారిశ్రామికవేత్తలు చింతా వెంకటరెడ్డి, తేతల సుబ్బరామారెడ్డి, చింతా సుబ్బారెడ్డి, వివిధ గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, పార్టీ నేతలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

వినాయక మండపాల ఏర్పాటుకు అనుమతి తప్పనిసరి

రామచంద్రపురం: జిల్లా ఎస్పీ ఎస్.శ్రీధర్ ఆదేశాల మేరకు ఈ నెల 18 నుంచి జరిగే వినాయక చవితి వేడుకల మండపాల ఏర్పాటుకు పోలీస్ స్టేషన్ నుంచి అనుమతి తీసుకోవాలని పట్టణ ఎస్సై డి.సురేష్‌బాబు గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. వినాయక చవితి వేడుకల్లో మండపాల నిర్వాహకులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని తెలిపారు. విగ్రహాన్ని ఏర్పాటు చేసే సంబంధిత స్థల యజమాని లేదా సంబంధిత విభాగపు అధికారుల అనుమతితో పోలీస్ స్టేషన్‌ను సంప్రదించాలని పేర్కొన్నారు. విద్యుత్ శాఖ అనుమతి తప్పనిసరిగా పొందాలని, ఆయా విభాగాలు సూచించిన నిబంధనలకు అనుగుణంగా పందిళ్లు, మండపాల వద్ద ముందస్తుగా ఇసుక, నీళ్లు ఏర్పాటు చేసుకోవాలని స్పష్టం చేశారు. విద్యుత్ వైర్లు, ప్రకాశవంతమైన లైట్ల వినియోగంలో జాగ్రత్తలు వహించాలని షార్ట్ సర్క్యూట్ జరగకుండా చూసుకోవాలని తెలిపారు. గణేష్ విగ్రహాల ఎత్తు, బరువు, ఉత్సవం నిర్వహించే రోజు లు, నిమజ్జనం తేదీ, సమయం, నిమజ్జన మార్గం, నిమజ్జనానికి ఉపయోగించే వాహన వివరాలను ముందుగా పోలీస్ స్టేషన్ అధికారికి తెలియజేయాలని స్పష్టం చేశారు. ఏవైనా మార్పులున్నా కూడా తక్షణమే తెలియజేయాలన్నారు. పందిళ్లు, మండపాల వద్ద పోలీసుల అనుమతి పొందిన నిర్ణీత సమయాల్లో మాత్రమే లౌడ్ స్పీకర్లను ఉపయోగించాలని తెలిపారు. రాత్రి వేళల్లో మండపాల వద్ద విధిగా ఆర్గనైజింగ్ కమిటీ ప్రతినిధులు ఉండాలని, తగు భద్రతా ఏర్పాట్లు చేసుకోవాలని, అక్కడ విలువైన వస్తువులు ఉంచకుండా జాగ్రత్తలు తీసుకోవాలని ఎస్సై సురేష్‌బాబు స్పష్టం చేశారు.

ఆంధ్రప్రదేశ్ దేవదాయ ధర్మదాయ శాఖ

ఇ-ప్రొక్యూర్‌మెంట్ నోటీసు

ఇ-ప్రొక్యూర్‌మెంట్ ద్వారా శ్రీ భీమేశ్వర స్వామి దేవస్థానము, ద్రాక్షారామం గ్రామము, రామచంద్రపురం మండలం, డా॥ బి.ఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లా దేవాలయమును అభివృద్ధి చేయుటకు రూ.100.00 లక్షలకు టెండరు పిలుచుట జరుగుచున్నది. ఇతర వివరములకు వెబ్‌సైట్ www.apeprocurement.gov.in నందు చూడగలరు.

కార్యనిర్వాహక అధికారి

జగనన్న ఆరోగ్య సురక్షపై శిక్షణ



సమావేశంలో మాట్లాడుతున్న మున్సిపల్ కమిషనర్ శ్రీకాంత్‌రెడ్డి

రామచంద్రపురం రూరల్: జగనన్న ఆరోగ్య సురక్ష, ఆయుష్మాన్‌భవ కార్యక్రమాలపై ఏఎన్‌ఎంలు, ఎంఎల్‌హెచ్‌పీలకు మండల ప్రజాపరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో గురువారం శిక్షణ నిర్వహించారు. రామచంద్రపురం సబ్ డివిజనల్ అధికారి డాక్టర్ ఆర్.సుదర్శన్ మాట్లాడుతూ, గ్రామ వలంటీర్లు శుక్రవారం నుంచి ఇంటింటికీ వెళ్లి సర్వే చేసి, ప్రజల ఆరోగ్య వివరాలు నమోదు చేసుకోవాలని అన్నారు. ఆరోగ్యశ్రీ నెట్‌వర్క్ ఆసుపత్రుల వివరాలను ప్రజలకు తెలియజేయాలని సూచించారు. ఏఎన్‌ఎంలు, ఎంఎల్‌హెచ్‌పీలు ఈ నెల 16 నుంచి ఇంటింటికీ వెళ్లి, యాప్ ద్వారా ప్రజల ఆరోగ్య స్థితిని నమోదు చేయడంతో పాటు అవసరమైన పరీక్షలు నిర్వహించాలని చెప్పారు. వైద్య శిబిరాల నిర్వహణపై ప్రజలకు వివరించి, సద్వినియోగం చేసుకునేలా చర్యలు తీసుకోవాలన్నారు. మున్సిపల్ కమిషనర్ శ్రీకాంత్‌రెడ్డి మాట్లాడుతూ, పట్టణ పరిధిలో రెండు వైద్య శిబిరాలు నిర్వహిస్తామని చెప్పారు. ఎంపీడీఓ షెలత్‌రాజు మాట్లాడుతూ, రూరల్ పరిధిలో 19 వైద్య శిబిరాలు నిర్వహిస్తామని తెలిపారు. కార్యక్రమంలో డీఎల్‌డీఓ ఎ..శాంతి, ద్రాక్షారామ, వెల్ల పీహెచ్‌సీ వైద్యాధికారులు డాక్టర్ ఎస్.ప్రశాంతి, డాక్టర్ మమత, అర్బన్ పీహెచ్‌సీ వైద్యాధికారులు డాక్టర్ హేమసుధీర్, డాక్టర్ లలిత, డివిజనల్ సూపర్‌వైజర్ జి.కమలేషు తదితరులు పాల్గొన్నారు.

నేడు నూతన పింఛన్ల పంపిణీ

రామచంద్రపురం రూరల్: మండలంలో కొత్తగా మంజూరైన 626 పింఛన్లను ఆయా లబ్ధిదారులకు రాష్ట్ర బీసీ సంక్షేమం, సమాచార, పౌర సంబంధాలు, సినిమాటోగ్రఫీ శాఖల మంత్రి చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాలకృష్ణ పంపిణీ చేయనున్నారు. రామచంద్రపురం పట్టణంలోని లయన్స్ కల్యాణ మండపం వద్ద శుక్రవారం ఉదయం 10 గంటలకు ఈ కార్యక్రమం జరుగుతుంది. దీనికి మండలంలోని ప్రజాప్రతినిధులు హాజరు కావాలని ఎంపీడీఓ ఎస్.షెలత్‌రాజు గురువారం ఒక ప్రకటనలో కోరారు.

అవార్డులు బాధ్యతలను పెంచుతాయి



ఉత్తమ ఉపాధ్యాయుడు రాజును సత్కరిస్తున్న డీఈఓ కమల కుమారి

కె.గంగవరం: విధి నిర్వహణలో పొందిన అవార్డులు బాధ్యతలను మరింత పెంచుతాయని జిల్లా విద్యా శాఖాధికారి (డీఈఓ) కమల కుమారి అన్నారు. ఇటీవల రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయుడి అవార్డు అందుకున్న నేతునూరి రాజును అమలాపురంలో జరిగిన ప్రత్యేక సమావేశంలో ఆమె సత్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, ఇకపై కూడా విద్యార్థులకు మెరుగైన విద్యను, ఉత్తమ సేవలు అందించి భవిష్యత్తులో మరిన్ని అవార్డులు పొందాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో సీఎంఓ సుబ్రహ్మణ్యం, ఏఎంఓ రాంబాబు, ఎంఈఓలు అలజంగి నాగరాజు, చోడిశెట్టి ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

ఎస్సీలకు సముచిత స్థానం



మంత్రి వేణుకు కృతజ్ఞతలు తెలుపుతున్న ఏఎంసీ చైర్మన్ గోవిందరాజు

రామచంద్రపురం: రాష్ట్ర బీసీ సంక్షేమం, సమాచార, పౌర సంబంధాలు, సినిమాటోగ్రఫీ శాఖల మంత్రి చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాలకృష్ణ సారథ్యంలో నియోజకవర్గంలోని ఎస్సీ సామాజికవర్గానికి సముచిత స్థానం లభిస్తోందని ఏఎంసీ చైర్మన్ పండు గోవిందరాజు అన్నారు. రెండోసారి ఏఎంసీ చైర్మన్‌గా నియమితులైన ఆయన.. గురువారం మంత్రి వేణును కలిసి కృతజ్ఞతలు తెలిపారు. జిల్లా స్థాయి పదవులతో పాటు నియోజకవర్గంలో ఎస్సీల అభివృద్ధికి మంత్రి వేణు కృషి చేస్తున్నారని గోవిందరాజు అన్నారు. పార్టీ నేతలు పెట్టా శ్రీనివాసరావు, అంబటి తుకారం, తోకల శ్రీను, దొమ్మలపాటి సత్యనారాయణ పాల్గొన్నారు.

మాతాశిశు పరిరక్షణే ప్రభుత్వ ధ్యేయం



ర్యాలీ నిర్వహిస్తున్న అధికారులు, పీహెచ్‌సీ సిబ్బంది

కాజులూరు: మాతాశిశు పరిరక్షణే ధ్యేయంగా రాష్ట్ర ప్రభుత్వం పని చేస్తుందని కిల్కారీ మొబైల్ అకాడమీ ప్రోగ్రాం డైరెక్టర్ మోహన్ అన్నారు. గర్భిణులు, బాలింతలకు కిల్కారీ మొబైల్ అకాడమీ ద్వారా అందించే సేవలపై దుగ్గుదుర్రు పీహెచ్‌సీలో ఏఎన్‌ఎంలు, ఆశా వర్కర్లు, సిబ్బందికి గురువారం శిక్షణ తరగతులు నిర్వహించారు. వైద్యాధికారులు వై.సుక్రియ, జి.స్వాతి ఆధ్వర్యాన జరిగిన ఈ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ, గర్భిణులైనప్పటి నుంచి బిడ్డ పుట్టిన ఏడాది వరకూ 72 వారాల పాటు ప్రతి వారం అకాడమీ ప్రోగ్రాం నుంచి ఆ మహిళకు ఫోన్ చేసి, వారి ఆరోగ్యాన్ని పరిరక్షిస్తారని చెప్పారు. సుఖప్రసవంతో పాటు, కుటుంబ సంక్షేమ శస్త్రచికిత్స, బిడ్డకు క్రమం తప్పకుండా వేయాల్సిన టీకాలు, వ్యాక్సిన్లపై అవగాహన కల్పిస్తారని తెలిపారు. దీనిపై మహిళలకు అవగాహన కల్పించాలని మోహన్ సూచించారు. అనంతరం సిబ్బంది గ్రామంలో ర్యాలీ నిర్వహించి, కిల్కారి మొబైల్ అకాడమీ కార్యక్రమంపై ప్రజలకు అవగాహన కల్పించారు.

ఘనంగా హిందీ భాషా దినోత్సవం



వెలగతోడు హైస్కూల్‌లో సాంస్కృతిక ప్రదర్శన చేస్తున్న విద్యార్థినులు



హిందీ రచయితల చిత్రాలతో పాఠశాల విద్యార్థులు, ఉపాధ్యాయులు

మండపేట: మండలంలో జాతీయ హిందీ భాషా దినోత్సవాన్ని గురువారం ఘనంగా నిర్వహించారు. పట్టణంలోని సంఘం కాలనీలో మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల, వెలగతోడులోని జెడ్పీ ఉన్నత పాఠశాలలో జరిగిన వేడుకల్లో ఉపాధ్యాయులు మాట్లాడుతూ హిందీ భాష విశిష్టత, ఆవిర్భావం గురించి విద్యార్థులకు వివరించారు. విద్యార్థులకు డ్రాయింగ్, వక్తృత్వం, వ్యాసరచన పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. హిందీ భాషపై విద్యార్థులతో సాంస్కృతిక ప్రదర్శనలు నిర్వహించారు. ఆయా పాఠశాలల్లో జరిగిన వేడుకల్లో హెచ్‌ఎం ముత్యాల మాణిక్యాంబ, చిట్టూరి శ్రీధర్, వీరభద్రరావు, శ్రీనివాస్, జనార్ధనరావు, రాజు, ఖాన్, కృపామణి, రత్న కుమారి తదితరులు పాల్గొన్నారు.

కపిలేశ్వరపురం: జాతీయ హిందీ దినోత్సవాన్ని మాచర జెడ్పీ ఉన్నత పాఠశాలలో గురువారం ఘనంగా నిర్వహించారు. హిందీ ఉపాధ్యాయుడు రేవు భీమారావు గీచిన కబీర్, తులసీదాస్, సుమిత్రానందన్ పంత్‌ల చిత్రాలను విద్యార్థుల ముందు ఆవిష్కరించారు. వారి రచనలను వివరించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు అతవ రాంబాబు, వాడ్రేవు శ్రీనివాసరావు, వెంకట్, రాజశేఖర్, షిరిడిసాయి, ఉదయ్, వీరబాబు, శ్రీహరి, శిరోమణి పాల్గొన్నారు.


విద్యుత్ సరఫరాకు నేడు అంతరాయం

కాజులూరు: స్థానిక సబ్ స్టేషన్ పరిధిలోని గ్రామాల్లో శుక్రవారం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలగనుంది. సబ్ స్టేషన్, లైన్ల మరమ్మతులు, చెట్ల కొమ్మల తొలగింపు పనుల కోసం ఉదయం 8 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకూ కాజులూరు, తిప్పరాజుపాలెం, అయితపూడి, ఒంటితాడి తదితర గ్రామాల్లో గృహ, రొయ్యల చెరువులు, ఇండస్ట్రియల్ ఫీడర్ పరిధిలో విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నారు. ఏపీ ఈపీడీసీఎల్ కాకినాడ డీఈ జి.ప్రసాద్ సబ్ స్టేషన్ ఏఈ ఎం.సూర్యనారాయణ గురువారం ఈ విషయం తెలిపారు.

మండపేట: మారేడుబాక సబ్‌స్టేషన్ పరిధిలో వార్షిక మరమ్మతుల నేపథ్యంలో శుక్రవారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకూ పట్టణంలోని పలు ప్రాంతాలకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్టు డీఈఈ జి.తిరుమలరావు తెలిపారు. మారేడుబాక, మహిళానగర్, గొల్లలగుంట, మెయిన్‌రోడ్డు, తర్వాణిపేట, బ్యాంకు కాలనీ, ధర్మగుండం చెరువు, రావులపేట, గాంధీనగర్ తదితర ప్రాంతాలకు సరఫరా నిలిచిపోతుందని తెలిపారు.

రాయవరం: స్థానిక సబ్‌స్టేషన్ పరిధిలో ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడనుంది. ఈ విషయాన్ని రామచంద్రపురం సబ్ డివిజన్ ఈఈ వై.విజయానంద్ గురువారం విలేకరులకు తెలిపారు.

వేదఘోషతో మార్మోగిన తాపేశ్వరం



వేద పఠనం చేస్తున్న వేదపండితులు

మండపేట: రాష్ట్ర నలుమూలల నుంచి తరలివచ్చిన వేద పండితులతో మండలంలోని తాపేశ్వరం వేదఘోషతో మార్మోగింది. వేదశాస్త్ర పరిషత్ ఆధ్వర్యంలో 71వ వార్షిక వేద మహాసభ గురువారం గ్రామంలోని ఉమాఅగస్త్యేశ్వరస్వామివారి ఆలయంలో ఘనంగా జరిగింది. వివిధ జిల్లాల నుంచి దాదాపు 250 మంది వేద పండితులు హాజరై వేదాలను వల్లె వేశారు. వేద పండితులు చిర్రావూరి రామశర్మ, గొల్లపల్లి విశ్వనాథ గణపతి, రాళ్లపల్లి సుబ్రహ్మణ్యశర్మ తదితరులు మాట్లాడుతూ వేదాల ప్రాముఖ్యతను వివరించారు. అన్ని శాస్త్రాలకు మూలం వేదమేనని, విదేశాల్లోను వేదాలకు ఎంతో గౌరవ ఉందన్నారు. వేదమంత్రాలను డిజిటలైజేషన్ చేయడం భవిష్యత్ తరాలకు గొప్ప ధనమని కొనియాడారు. గ్రామానికి చెందిన సురుచి ఫుడ్స్ అధినేత పోలిశెట్టి మల్లిబాబు, భారతి దంపతులు వేదపండితులను ఘనంగా సత్కరించి పండ్లు, స్వీట్లు అందజేశారు.

ధ్యాన మార్గం అనుసరణీయం

కపిలేశ్వరపురం: ధ్యానమార్గం అనుసరణీయమని భీమవరానికి చెందిన సీనియర్ ధ్యాన ప్రచారకులు శ్రీనివాస్ అన్నారు. పడమర ఖండ్రికలోని ఉయ్యాల జంపాల దైవ క్షేత్రం శ్రీ కణ్వ మహర్షి పిరమిడ్ ధ్యాన మందిరంలో గురువారం ఆత్మజ్ఞాన శిక్షణా తరగతిని నిర్వహించారు. అంగర, పడమర ఖండ్రిక పిరమిడ్ స్పిరిట్యువల్ సొసైటీ ఆధ్వర్యంలో నిర్వహించిన తరగతిలో వక్తలు మాట్లాడుతూ మానసిక, శారీరక ఆరోగ్యానికి శాత్విక ఆహారం మేలు అన్నారు. అంగర, పడమర ఖండ్రిక గ్రామాల ప్రతినిధులు పాల్గొన్నారు.

'ఆయుష్మాన్‌భవ'ను విజయవంతం చేయండి

మండపేట: ఆయుష్మాన్ భవ కార్యక్రమం విజయవంతానికి ఆశ కార్యకర్తలు, ఆరోగ్య సిబ్బంది కృషి చేయాలని రామచంద్రపురం డివిజన్ ఆఫీసర్ డాక్టర్ సుదర్శన్‌బాబు కోరారు. స్థానిక మున్సిపల్ కార్యాలయంలో గురువారం ఆయుష్మాన్‌భవ కార్యక్రమంపై ఆశ కార్యకర్తలకు శిక్షణ ఇచ్చారు. ఆరోగ్యకరమైన భారత్, సామర్థ్యం కలిగిన భారత్ లక్ష్యంగా కేంద్ర ప్రభుత్వం ఈ నెల 17వ తేదీ నుంచి అక్టోబరు 3వ తేదీ వరకూ ఈ కార్యక్రమాన్ని అమలుచేస్తోందన్నారు. ఆయుష్మాన్ భారత్ యాప్ ద్వారా ప్రధానమంత్రి జన్ ఆరోగ్య యోజన, ఆయుష్మాన్ మేళ క్యాంపులు నిర్వహించి అవయవ, రక్తదానాలు తదితర వాటిపై ప్రజలకు అవగాహన కల్పించడంతో ప్రతి పేద కుటుంబానికి ఆయుష్మాన్ కార్డులు పంపిణీ చేయనున్నట్టు వివరించారు. ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

మేకలు, గొర్రెలకు వ్యాధి నిరోధానికి టీకాలు

కె.గంగవరం: మేకలు, గొర్రెల్లో పారుదు వ్యాధి (పీసీఆర్) నివారణకు గురువారం దంగేరు గ్రామంలో పశు సంవర్ధక శాఖ ఆధ్వర్యాన టీకాల కార్యక్రమం నిర్వహించారు. దీనిని సర్పంచ్ కొప్పిశెట్టి రమణ, ఎంపీటీసీ సభ్యుడు కొప్పిశెట్టి లక్ష్మణ్ ప్రారంభించారు. అనంతరం గ్రామంలోని సుమారు 400 మేకలు, గొర్రెలకు పశువైద్య సిబ్బంది టీకాలు వేశారు. ప్రతి గొర్రెకు, మేకకు ఈ వ్యాక్సిన్ తప్పకుండా వేయించాలని పెంపకందార్లకు పశు వైద్యుడు రాజు సూచించారు. ఈ కార్యక్రమంలో పశువైద్యాధికారి సంయుక్త లక్ష్మి, గోపాలమిత్ర నారాయణ పాల్గొన్నారు.







